

# విద్యుత్ అంతరాయానికి చెక్..!

**-గ్రేటర్‌లో కొత్తగా మరో 34సబ్‌స్టేషన్లు**
**-స్థల సమీకరణలో నిమగ్నమైన అధికారులు**
**-వినియోగం పెరుగుతుండటంతో కొత్తవాటికి ప్రతిపాదనలు**

**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త:** గ్రేటర్‌లో గృహనిర్మాణాలు, పరిశ్రమలు, వాణిజ్య సముదాయాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. దీంతో విద్యుత్ వినియోగం కూడా అంతే పెరుగుతుంది. వీటన్నింటికీ దృష్టిలో ఉంచుకుని విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా చేయాలని నూతన సబ్‌స్టేషన్ల నిర్మాణానికి విద్యుత్‌శాఖ చర్యలు తీసుకుంటుంది. అందులో భాగంగా 34సబ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తుంది. రానున్న ఏప్రిల్‌నాటికి కొత్తసబ్ స్టేషన్ల వినియోగం తీసుకురావాలని భావిస్తున్నట్లు తెలుస్తుంది. ఇందుకోసం భూసేకరణ చేసే పనిలో విద్యుత్ అధికారులు నిమగ్నమైపోయారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రోజుకు సగటున 3500 మెగావాట్ల విద్యుత్ అవసరం అవుతుంది. ప్రతినెలా 2,500పైగా కొత్త కనెక్షన్లు మంజూరవుతున్నాయి. ఒకప్పుడు ధనవంతుల ఇండ్లలోనేమాత్రమే కన్పించే ఏసీలు, రిఫ్రిజిరేటర్లు ,వాషింగ్ మెషిన్లు, ఓవెన్లు, గ్రీజర్లు ప్రస్తుతం ప్రతిఇంట్లో సర్వసాధారణమయ్యాయి. ఫలితంగా సామర్థ్యానికి మించి విద్యుత్ వినియోగిస్తుండటంతో సబ్‌స్టేషన్లు ఒత్తిడికి లోనవుతున్నాయి. రానున్న కాలంలో మరింత డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నట్లు విద్యుత్ అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో కొత్త సబ్‌స్టేషన్లు నిర్మించి ఇబ్బందులు రాకుండా డిస్కం ప్రణాళికలు సిద్దం చేస్తున్నారు. గ్రేటర్ జోన్‌లోని 9సర్కిళ్లు 33/11 కేవీకి సంబంధించి 423సబ్ స్టేషన్లు ఉన్నాయి. పలు సర్కిళ్లలో సబ్‌స్టేషన్లు సంఖ్య తక్కుగా ఉండటంతో విద్యుత్ డిమాండ్ పెరిగినప్పుడు లోడ్ పెరిగి సరఫరాలో అంతరాయాలు తలెత్తుతున్నాయి. కొత్త సబ్‌స్టేషన్లు నిర్మిస్తే ఉన్నవాటిపై లోడ్ తగ్గించడంతో పాటు సరఫరా ఇబ్బందులు రాకుండా ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు. అదేవిధంగా కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు స్థలాల కొరత తీవ్రంగా ఉంది. సబ్‌స్టేషన్లు ఏర్పాటుకు విద్యుత్‌శాఖవద్ద డబ్బులు ఉన్నా స్థలాలు లభించక ఆలస్యమవుతున్నట్లు తెలుస్తుంది. ఈనేపథ్యంలో సబ్‌స్టేషన్ల నిర్మాణానికి స్థలాలను కేటాయించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు అధికారులకు లేఖరాశారు.

### ఈప్రాంతాల్లోనే సబ్‌స్టేషన్లు...

శివారు ప్రాంతంలో నగరం శరవేగంగా అభివృద్ధి చెందతుండటంతో విద్యుత్ డిమాండ్ సైతం పెరుతుంది. వ్యాపార, పారిశ్రామిక, వాణిజ్య సంస్థలు ,గృహసముదాయాలు కూడా భారీగా వెలుస్తున్నాయి. దీంతో కొత్త సబ్‌స్టేషన్‌లను నిర్మించాలని డిస్కం భావిస్తుంది. దీంతో సబ్‌స్టేషన్లను ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలన్నదానిపై అధికారులు కసరత్తు పూర్తి చేసినట్లు సమాచారం. ముఖ్యంగా సైబర్‌సిటీ సర్కిల్ పరిధిలోని నెక్నంపూర్, బొటానికల్ గార్డెన్, నల్లగండ్ల, హాఫీజ్‌పేట్, 8వ పోలీస్ బెటాలియన్, మంచిరేవుల, అలాగే రాజేంద్రనగర్ సర్కిల్‌లోని హిమాయత్‌సాగర్ సమీపంలోని పిఅండ్ టి కాలనీ, బైరాగి గూడ, ఓంనగర్, సాతంరాయి, లక్ష్మీగూడ హౌజింగ్‌బోర్డు కాలనీ, బండ్ల గూడ సర్వేనెంబర్ 82లో, శంషాబాద్ హుడాకాలనీ, పద్మావతి కాలనీ, మీరాలంపార్కు, రాజేంద్రనగర్ ఆర్డీవో ఆఫీసు, కాటేదాన్ కింగ్స్ కాలనీ, జల్‌పల్లి నూరినగర్, బండ్లగూడలోని మహ్మద్‌నగర్, సరూర్‌నగర్ సర్కిల్‌లోని ఫతుల్లాగూడ, కుంట్లూరు మథర్‌డెయిరీ సమీపంలో, బిఎన్‌రెడ్డి నగర్‌లోని సాహేబ్‌నగర్, బడంగ్‌పేట్ డంపింగ్ యార్డ్ , మన్సూరాబాద్ పెద్దచెరువు ఏర్పాటు చేసేందుకు భూమి ఇవ్వాలని జిల్లా కలెక్టర్లను డిస్కం కోరింది.

## బల్దియాలో పెరుగుతున్న కాంగ్రెస్ బలం

**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త:** పార్లమెంట్ ఎన్నికల తర్వాత వసలతో హస్తం పార్టీ దూకుడు పెంచింది. ఓవైపు ఎమ్మెల్యేలు, ఎంఎల్‌సిల చేరికలతో శాసనసభ ,మండలిలో తన బలాన్ని పెంచుకుంటున్న కాంగ్రెస్ అటు జిహెచ్‌ఎంసి కౌన్సిల్‌లోనూ కార్పొరేటర్లను చేర్చుకుని నగరంపై పట్టు సాధించాలని చూస్తుంది. ఈక్రమంలోనే పలువురు కార్పొరేటర్లను కాంగ్రెస్‌లో చేర్చుకుంటుంది. ఇప్పటికే పలువురు బిఆర్‌ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరగా ...శనివారం శేరిలింగంపల్లి కార్పొరేటర్ నాగేందర్ యాదవ్, మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, చందానగర్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ సిఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. దీంతో జిహెచ్‌ఎంసి కౌన్సిల్‌లో బిఆర్‌ఎస్ కార్పొరేటర్ల సంఖ్య 56నుంచి 41కి పడిపోగా .కాంగ్రెస్ కార్పొరేటర్ల సంఖ్య 3నుంచి 25కి చేరింది. బిజెపి కార్పొరేటర్ల సంఖ్య 39కి చేరింది.

## ఆస్తులు కాపాడుకునేందుకే ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పార్టీలు మారుతున్నారు

**- కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి**



విలేకర్ల సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, బిజెపి నాయకులు

**మైలార్‌దేవ్‌పల్లి, జూలై 13 ప్రభాతవార్త :** రాజ్యాంగ బద్దంగా ఎన్నికైన రాజంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ తన సొంత ప్రయోజనాలు, ఆస్తులు కాపాడు కునేందుకు పార్టీలు మారుతున్నారని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి కంటెస్టెడ్ ఎమ్మెల్యే.మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు.కాటేదాన్‌లో పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధి కోసం అధికార పార్టీలోకి చేరటం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు పరిపాటిగా మారిందని తెలిపారు.ఎనిమిది సంవత్సరాలు బిఆర్‌ఎస్‌లో కొనసాగిన ప్రకాష్ గౌడ్ నియోజకవర్గం అభివృద్ధి కోసం చేసింది ఏమిలేదని ఆయన విమర్శించారు.మంచినీటి దాహార్తిని తీర్చేందుకు టిడిపి నుంచి టిఆర్‌ఎస్‌లోకి చేరిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఇంత వరకు గండిపేట్ మండలానికి మంచినీరు తీసుకు రాలేక పోయారని,ఇప్పుడు శంషాబాద్ మండలంలో రైతుల సమస్యలను పరిష్కరించటానికి కాంగ్రెస్‌లో పార్టీలో చేరినట్లు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఆయన తెలియజేశారు.ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ భూకబ్జాలు చేశారని ఆయన తెలిపారు.ఈ విలేకర్ల సమావేశంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షులు అడికె జనార్దన్,నాయకులు జోగి రవి,శీలం తిరుపతి రెడ్డి, నరసింహారెడ్డి,బుచ్చిరెడ్డి,శివ,శ్రీకాంత్,రెడ్డి,రామకృష్ణ,వెంకట్‌రెడ్డి,శివశంకర్,రాజ్ కుమార్, గోపాల్ నాయక్,శంకర్‌రెడ్డి,కురమయ్య పాల్గొన్నారు.

## నిరుద్యోగులను తప్పు దోవ పట్టిస్తున్న కెటిఆర్



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న చనగాని దయాకర్

**తార్నాక, జూలై 13 ప్రభాతవార్త:** నిరుద్యోగులను మాజీ మంత్రి కేటీఆర్ తప్పు దోవ పట్టిస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆరోపించారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ వద్ద టీపీసీసీ అధికార ప్రతినిది చనగాని దయాకర్ ఆద్వర్యంలో శనివారం నిరుద్యోగులతో ప్లకార్డులతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కేటీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేసేందుకు యత్నించడంతో పోలీసులు భారీగా చేరుకొని అడ్డుకున్నారు. అనంతరం వారిని ఓ.యూ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దయాకర్‌తో పాటు ఎన్‌ఎస్‌యూఐ నాయకులు మేడ శ్రీను, వినయ్‌లను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా చనగాని దయాకర్ మాట్లాడుతూ పది సంవత్సరాలు అధికారంలో ఉన్న కేటీఆర్ నిరుద్యోగుల గురించి మాట్లాలేదని నేడు నిరుద్యోగుల గురించి మాట్లాడటం విడ్డురంగా ఉందన్నారు. కొందరు కేటీఆర్ ముఠా సభ్యులు నిరుద్యోగుల ముసుగు వేసుకొని నిరుద్యోగులను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. దేశంలో ఎక్కడ లేని విధంగా ఉద్యోగాల భర్తీ ప్రక్రియ జరుగుతుందన్నారు. నిజమైన నిరుద్యోగులు లైబ్రరీల్లో మౌనంగా ప్రిపేర్ అవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం త్వరలో జాబ్ క్యాలండర్ విడుదల చేయబోతుందన్నారు.

## మణికొండలో వైభవంగా జగన్నాథ రథయాత్ర



మణికొండలో పంచవటి కాలనీలో జగన్నాథ రథయాత్ర జరుగుతున్న దృశ్యం

**నార్సింగి, జూలై 13 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలి టీ పరిధిలోని పంచవటి కాలనీలో శనివారం సాయంత్రం జగన్నాథ రథయాత్ర వైభవంగా జరిగింది. ఇస్కాన్, బ్లాజం కిడ్స్, రామాలయం ట్రస్టు ఆధ్వర్యంలో కాలనీలోని రామాల యం దగ్గర నుంచి ఈ యాత్ర ప్రారంభమై పుర వీధులన్నీ తిరిగింది. బాలికలు భగవద్గీత శ్లోకాలను ఆలపించారు. జగన్నాథుడి కీర్తనలు, భజనలు చేస్తూ ఆడి, పాడుతూ యాత్ర లో పాల్గొన్నారు. చిన్నా,పెద్ద,ఆడ,మగ,వృద్దులు అంతా "హరేకృష్ణ హరేకృష్ణ-హరేరామ హరేరామ" అన్న నామాన్ని జపిస్తూ మైమరిచిపోయారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్నాథ రథయాత్రం మణికొండ పురవీధులలో సాగడం మా అదృష్టం గా భావిస్తు న్నామన్నారు. ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు హిందూ సంస్కృతి ని, భగవద్గీతను ప్రపంచం నలు మూలల వ్యాపింప చేస్తున్న తీరు అమోఘమన్నారు. ఇస్కాన్ సంస్థ ప్రతి రోజు కోట్లాది మం దికి ఉచిత భోజనాలు పెడుతుందన్నారు. మన బిడ్డలకు విధిగా భగవద్గీత శ్లోకాలు చదివించాలని, మన ధర్మం గొప్పతనంను వివరింలన్నారు. నిత్యం దేవాలయాలకు వెళ్లాలని, పిల్లలను వెంట తీసుకెళ్లి ఆధ్యాత్మికత గొప్పతనంను ఒంటబట్టించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచవటి కాలనీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ, రామాలయం ట్రస్టు అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, రామారావ్, భీంరెడ్డి, పుల్లారావ్, మూర్తి, శివలతో పాటు వందలాది మంది భక్తజనం పాల్గొన్నారు.

## భారతీయ కళలు, సంస్కృతి సంప్రదాయాలే మన జీవనాడి

**-కేంద్ర మాజీమంత్రి సముద్రాల వేణుగోపాలాచారి**

**నాంపల్లి, జూలై 13 ప్రభాతవార్త :** మన జీవనాడి భారతీయ కళలు, సంస్కృతి, సంప్రదాయాలేనని, వాటిని ప్రపంచవ్యాప్తం చేయాలని కేంద్ర మాజీ మంత్రి డా. సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకిరాజా యోనా ఆధ్వర్యంలో శనివారం ఉదయం నవరసభరితం, నయనానందకరంగా నిర్వహించిన భారతీయ లలితకళా ఉత్సవ్ 2024కు వేణుగోపాలాచారి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగిస్తూ భారతీయ లలితకళలు ఎంతో గొప్పవి ప్రాధాన్యతను సంతరించుకున్నాయని గుర్తుచేశారు. నేటి సమాజంలో కళలపట్ల చిన్నచూపుతో మానసిక ఒత్తిడికి, ఒడుదుడుకులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తపరిచారు. కళలను బ్రతికిస్తే అవి మనని బ్రతికిస్తాయని హితవుపలికారు. కళలు మనిషికి చైతన్యం సొగసులద్దుతాయని డా. చిలుముల బాల్‌రెడ్డి అధ్యక్షోపన్యాసంలో అన్నారు. సంస్థ అధ్యక్షుడు డా. అద్దంకిరాజా తమ సంస్థ కళలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ జాతీయ అంతర్జాతీయస్థాయిల్లో కళాకారులను గుర్తించి తగినరీతిలో గౌరవిస్తూ భారతీయ కళలకు విశ్వవ్యాప్తంగా గుర్తింపు తెస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి వేణుగోపాలాచారి విశిష్ట అతిథులు రొమ్యూరు ఆశ్రిత, ధరావత్ బాలసన్‌నాయక్, రొమ్యూరు శేషసాయి, మాగంటి ప్రసాద్‌బాబు, అద్దంకిరాజా తదితరులతో కలిసి ఉభయ తెలుగురాష్ట్రాలకు చెందిన వివిధరంగాలలో నిష్ణాతులైన 25మంది ప్రతిభావంతులను జాతీయ స్థాయిలో కళారత్న; విద్యారత్న; వైద్యరత్న; సేవారత్న; సంఘమిత్ర, పర్యావరణ మిత్ర; రైతుమిత్ర అవార్డులతో ఘనంగా సత్కరించి వారి సేవలను అభినందించారు. నేటి భారతీయ లలితకళా ఉత్సవ్‌లో కళాకారుల వివిధ అంశాలతో ప్రదర్శనలు ఆహుతులను అలరించి, అబ్బురపరిచాయి.

### కొత్త చట్టం కేసులో ఇద్దరు వాహనదారులకు 2800 జరిమానా

**చార్మినార్, జూలై 13 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసు కొచ్చిన కొత్త చట్టల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో మొదటి కేసు హైదరాబాద్ పాతబస్తీ చార్మినార్ పోలీస్ స్టేషన్‌లో గత నెల 30వ తేదీన నమోదైన విషయం విధితమే. కాగా ఈ కేసులో ఇద్దరు ద్విచక్ర వాహన దారులకు ఒక్కొక్కరికి 1400 రూపాయలు చొప్పున 2800 రూపాయలు జరిమానా నాంపల్లి మొదటి ప్రత్యేక జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ దేవిరెడ్డి అభిరాంరెడ్డి విధించారని ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.జూన్ నెల 30వ తేదీ రాత్రి పాతబస్తీ గుల్జారాహౌస్ వద్ద నెంబర్ ప్లేట్లు లేని రెండు ద్విచక్ర వాహనాలపై ఇరువురు యువకులైన సోహెల్ అన్సారీ,ఎస్.కె.సన్వర్‌లు ప్రయాణం చేస్తున్నారు.పోలీసులు వారిపై నూతన చట్టమైన భారతీయ న్యాయ సంహిత సెక్షన్ సిఆర్ నెంబర్ 144/ 2024 అండర్ సెక్షన్ 281 బిఎన్‌ఎస్ అండ్ సెక్షన్ 80ఎ.177 ఎంవి యాక్ట్ ఆన్ 1-7-24 ప్రకారం కేసు నమోదు చేశారు.పోలీసులు ఇద్దరు వాహనదారులను మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా న్యాయమూర్తి దేవిరెడ్డి అభిరామ్ రెడ్డి ఇద్దరు వాహనదారులైన సోహెల్ అన్సారీ,ఎస్.కె.సన్వర్‌లకు 2800 రూపాయలు జరిమానా విధించారని చార్మినార్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ వెల్లడించారు.





హైదరాబాద్ వార్త


## శ్రీఉజ్జయినీ మహాకాళీ బోనాలను ఘనంగా నిర్వహిస్తాం



శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయం వద్ద ఉత్సవ ఏర్పాట్లపై అధికార్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని.

**-భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేయాలి**
**-వలంటీర్లకు ఫోటోతో కూడిన పాస్‌లు జారీ**
**-ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ట్రాఫిక్ అధికారులు చర్యలు చేపట్టాలి**
**-సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని**

**బేగంపేట జూలై 13, ప్రభాతవార్త:** ఎంతో చరిత్ర కలిగిన సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి బోనాల ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించుకునేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని మాజీ మంత్రి,సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.శనివారం వివిధ శాఖల అధికారులతో కల్సి శ్రీ ఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయ పరిసరాలలో తలసాని పర్యటించారు.ఈ సందర్భంగా ఈ నెల 21 వ తేదీన జరిగే బోనాల ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ ఈ ఏడాది కూడా జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు సూచించారు.బోనాల సందర్భంగా అమ్మ వారి ఆలయం వద్ద సేవలు అందించే స్వచ్ఛంద సంస్థలు,వాలెంటీర్లకు ఫోటోతో కూడిన ఐడెంటిటీ కార్డులను జారీ చేయాలని పోలీసు అధికారులను తలసాని ఆదేశించారు.అమ్మ వారి దర్శనానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పాటు పక్క రాష్ట్రాలు, ఇతర దేశాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారని,అందుకు అనుగుణంగా ఆలయం వద్ద ఏర్పాట్లు చేయాలన్నారు.అయితే ఈ విషయంలో అన్ని ముఖ్య శాఖల సమన్వయంతో ముందుకు సాగాలన్నారు.అదే విధంగా 22వ తేదీన రంగం (భవిష్యవాణి),అంబారీ ఊరేగింపు కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.అమ్మవారి దర్శనం సందర్భంగా క్యూ లైన్లలో ఎలాంటి తోపులాటలకు అవకాశం లేకుండా పటిష్టమైన బారికేడ్‌లను ఏర్పాటు చేయాలని చెప్పారు.అదే విధంగా భక్తులకు తాగునీటిని అందుబాటులో ఉంచే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.ఆలయ పరిసరాలలో ప్రత్యేక హెల్త్ క్యాంపులను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.తెలంగాణా ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి హోదాలో కల్వకుంట్ల చంద్రశేఖర రావు బోనాల ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించిన తర్వాత బోనాల ఉత్సవాల విశిష్టత మరింత పెరిగిందని చెప్పారు.ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగని రీతిలో అన్ని జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేసారు.బోనాల ఉత్సవాలలో భక్తులకు సేవలు అందించే వాలెంటీర్ల విషయంలో ప్రత్యేక శ్రద్ద చూపి వారికి ఫోటోతో కూడిన ఐడెంటిటీ కార్డులు అందిస్తామన్నారు.శాంతి భద్రతల పర్యవేక్షణ కోసం అదనపు పోలీసు సిబ్బంది నియామకంతో పాటు సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే తలసాని ఆదేశించారు.అదే విధంగా బోనాల రోజున వచ్చే భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు.ప్రశాంత వాతావరణంలో అందరి భాగస్వామ్యంతో బోనాల ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీసీ సమ్మయ్య,లా అండ్ ఆర్డర్ అదనపు డీసీపీ అశోక్,ఏసీపీ సర్దార్ సింగ్,సీ.ఐ.పరుశురాం,వాటర్‌వర్క్స్ జీఎం వినోద్,శానిటేషన్ డీఈ శ్రీనివాస్,అగ్నిమాపక శాఖ అధికారి మోహన్‌రావు,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకట్,ఆలయ ఈ ఓ మనోహర్‌రెడ్డి, ఛైర్మన్ కామేశ్వరరావు, దక్కన్ సేవా సమితి అధ్యక్షుడు ధర్మవీర్,కార్పొరేటర్ టి.మహేశ్వరి,మాజీ కార్పొరేటర్లు అత్తెల్లి మల్లికార్జునగౌడ్,కిరణ్మయి,బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్,ఆకుల హరికృష్ణ, వెంకటేశన్ రాజు,తదితరులు ఉన్నారు.

## పాతబస్తీలో మొహర్రం ఊరేగింపుకు తగిన బందోబస్తు

**- నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి**



నగర పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాస్ రెడ్డి చార్మినార్ వద్ద పోలీస్ అధికారులతో మొహరం ఊరేగింపు రూట్ మ్యాప్‌పై పరిశీలిస్తున్న దృశ్యం

**చార్మినార్, జూలై 13 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతనగరంలో జరగనున్న మొహరం ఊరేగింపుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.షియా ముస్లింలు ఈ నెల 17వ తేదీన పాతబస్తీలో నిర్వహించనున్న మొహరం ఊరేగింపును పురస్కరించుకుని నగర పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాస్‌రెడ్డి పోలీస్ ఉన్నతాధికారులతో కలిసి పాతనగరంలో పర్యటించారు.డబీర్‌పురలోని బీబీకా అలావాను ఆయన సందర్శించారు.బీబీకాఆలం నుంచి ఛాదర్‌ఘాట్ వరకు జరగనున్న ఊరేగింపు ప్రాంతాలైన మీర్‌చౌక్,ఎత్తెబార్ చౌక్.పాత చార్మినార్ బల్దియా కార్యాలయం, చార్మినార్, గుల్జారాహౌస్, కాలీకమాన్,పంజేషా.మీరాలంమండి,దారుషిఫా మైదానంతో పాటు చాదర్‌ఘాట్ ప్రాంతాలను కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొహరం పదివ రోజున పాతబస్తీలో జరగనున్న ఊరేగింపు సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు కలగకుండ అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో నగర అదనపు పోలీస్ కమిషనర్లు విక్రమాన్ సింగ్,పి.విశ్వప్రసాద్,దక్షిణ మండలం డిసిపి స్నేహ మెహ్రా, అడిషనల్ డిసిపి షేక్ జహంగీర్,మీర్‌చౌక్ ఎసిపి వెంకటేశ్వరరావుతో పాటు పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## ధైర్యసాహసాల పద్మజారెడ్డి కాకతీయం నృత్యనాటకం



కాకతీయం నృత్యనాటకంలో డా. పద్మజారెడ్డి

**రవీంద్రభారతి, జులై 13 ప్రభాతవార్త :** కాకతీయ రాజవంశ కాలంనాటి ప్రాచీన నృత్యసంప్రదాయాల పునరుద్ధరణ, ధైర్యసాహసాలు ప్రపంచానికి చాటిచెప్పేందుకు తెలంగాణ నృత్యఖ్యాతిని ఇనుమడింపజేస్తూ ప్రఖ్యాత నర్తకీమణి పద్మశ్రీ డా. పద్మజారెడ్డి కాకతీయ నృత్యనాటకం రూపొందించినట్లు తెలిపారు. గత దశాబ్దకాలంగా విస్తృత పరిశోధనలు చేసి తీర్చిదిద్దిన కాకతీయం రెండుభాగాలను ఇటు భారతదేశం, అటు అమెరికాలోని పలు ప్రముఖ వేదికలపై ప్రదర్శించి ప్రశంసలు అందుకోవడం, ఈ సుసంపన్నమైన వారసత్వం, క్లిష్టమైన సుందర నృత్యప్రక్రియలను మరింతగా ప్రోత్సహించడంలో భాగంగా కాకతీయం 3 నృత్యనాటకం ప్రదర్శించనున్నట్లు పద్మజారెడ్డి శనివారం మీడియాకు వివరించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సమక్షంలో ఈ నెల 17 బుధవారం రాత్రి 6గంటలకు రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ప్రదర్శించనున్న ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాసరెడ్డి, పి.సుదర్శన్‌రెడ్డి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం హాజరుకానున్నట్లు ఆమె పేర్కొన్నారు. డా. పప్పు వేణుగోపాలరావు రచన, డా. పద్మజారెడ్డి నృత్యదర్శకత్వం, పద్మశ్రీ డా. ఎల్లా వెంకటేశ్వరరావు సంగీత దర్శకత్వంలో రూపొందిన కాకతీయం నృత్యనాటకం తిలకించేందుకు పెద్దయెత్తున కళాప్రేమికులు, ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి విజయవంతం చేయాలని డా. పద్మజారెడ్డి కోరారు.

## జీహెచ్‌ఎంసి, జలమండలికి నిధులు మంజూరు చేయాలి : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



పార్కులో ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**ముషీరాబాద్, జూలై 13, ప్రభాతవార్త:** జీహెచ్‌ఎంసీ, జలమండలిలో నిధుల కొరతవల్ల ప్రజలకు అనేక సౌకర్యాలు కల్పించటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి కాబట్టి ఈ బడ్జెట్ సమావేశాలలో ప్రత్యేకంగా జీహెచ్‌ఎంసీకి, జలమండలికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర బొగ్గు గనుల శాఖామంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కవాడిగూడ డివిజన్ దోమలగూడలోని ఈసేవా పార్కులో ఓపెన్ జిమ్‌ను ఆయన స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్ రచనశ్రీలతో కలసి ప్రారంభించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో 30శాతం ప్రజలు నివాసం ఉంటున్నారని, అనేక ప్రాంతాలు మొక్కలు పెంచకపోవటం వల్ల కాంక్రీట్ జనరల్‌గా మారి భూతాపం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపులో భాగంగా అమ్మపేరుతో ప్రతి ఒక్కరూ ఒక మొక్కనాటాలని, మొక్కనాటి వదిలేయకుండా ప్రతినిత్యం దానిని పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటటం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించటంతో పాటు భావి తరానికి ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

### లోతట్టు ప్రాంతాల ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

**- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

**చిక్కడపల్లి, జూలై 13, ప్రభాతవార్త:** రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని జిహెచ్‌ఎంసి అధికారులు ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం గాంధీనగర్ డివిజన్‌లో రూ.50లక్షలతో నిర్మించతలపెట్టిన కచ్చానాల పైప్‌లైన్ నిర్మాణ పనులను రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్ కుమార్‌యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్‌తో కలిసి లాంఛనంగా ప్రారంభించి ప్రసంగించారు.

## ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ కౌన్సిలర్ దయానంద్

**అత్తాపూర్ జూలై13,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా శనివారం మాజీ కౌన్సిలర్ కోరని దయానంద్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఎమ్మెల్యేను కలిసిన వారిలో రాజేంద్రనగర్ సర్కిల్ అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పంబల రాజు,రమేష్ ఉదయ్ కిరణ్,హరిచంద్ర,ప్రసాద్,ఉన్నారు.

## మహాలక్ష్మీ అమ్మవారిని దర్శించుకున్న ఉదయ్ శర్మ



అమ్మవారి పూజల్లో పాల్గొన్న ఉదయ్ శర్మ

**పేట్ బషీరాబాద్, జూలై 13, ప్రభాతవార్త**

సుచిత్ర సెంటర్‌లోని శ్రీ రామానుజ యాగ్నికపీఠం శ్రీ కార్యసిద్ధి హనుమాన్ దేవస్థానం శ్రీ మహాలక్ష్మీ ఆలయంలో యాగ్నిక పీఠం అధ్యక్షులు యజ్ఞ చార్యస్వామి గోవర్ధన విద్యుల్లత ప్రవీణ్ కుమార్ ఆచార్య స్వామి నిర్వహిస్తున్నటువంటి శ్రావణమాస ఉత్సవ కార్యక్రమం అమ్మవారిని శనివారం హిందూ ధర్మ ప్రచారకర్త ఉదయ్ శర్మ బోధన్ పారిశ్రామికవేత్త నిజామాబాద్ గాలి రాములు, బోధన్ స్థానిక విలేకరి పి.చింటూలు సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసంలో చిన్నారులు, ముత్తైదువులతో హిందూ ధర్మ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు.



నగరంలో జరిగిన హైలైఫ్ ఫ్యాషన్ షోలో పాల్గొన్న మోడల్స్

# విద్యుత్ అధికారుల తీరుపై గిరిజనుల ఆగ్రహం



విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని 161 జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న గిరిజనులు

**-జాతీయ రహదారిపై రాస్తారోకో-ఆగిపోయిన వాహనాలు**

**-సర్దిచెప్పిన ఎఎస్ఐ -శాంతించిన గిరిజనులు**

**అల్లాదుర్గం, జూలై 13, ప్రభాతవార్త:** గాలి వస్తుందన్నా, మేఘాలు కమ్ముకున్నా విద్యుత్‌ను ఆపేయడం విద్యుత్ అధికారులకు అలవాటుగా మారిందని, రాత్రిళ్ల ప్రశాంతంగా కంటి మీద కునుకు లేకుండా పోతోందని గిరిజనులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ జాతీయ రహదారిపై విద్యుత్ సబ్ స్టేషన్ ముందు రాస్తారోకోకు దిగిన సంఘటన శనివారం మండల పరిధిలోని 161వ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి కురిసిన కొద్దిపాటి వర్షానికి మండల పరిధిలోని గొల్లకుంట తండాకు విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో ఆగ్రహించిన తండా వాసులు శనివారం రాస్తారోకోకు పూనుకుని అధికారులపై తమ అక్కసును వెల్లగక్కారు. రాత్రి తండాలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో దొంగలు మేకలను దొంగిలించుకుపోయారంటూ తండా వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. దొంగల వద్ద మారణాయుధాలు ఉండటంతో వారిని పట్టుకునేందుకు భయపడ్డామని గిరిజనులు భయాందోళన చెందారు. గతంలో అకోలా నాందేడ్ 161వ జాతీయ రహదారి పనులు మొదలైనప్పుడు తండాకు సరఫరా అయ్యే విద్యుత్ లైన్‌ను మార్చారని, నాటి నుంచి తమ తండాకు సక్రమంగా విద్యుత్ సరఫరా కావడం లేదని తండా వాసులు విచారం వ్యక్తం చేస్తున్నారు. గిరిజనులు జాతీయ రహదారిపై రాస్తారోకో చేయడంతో ఎక్కడి వాహనాలు అక్కడే అగిపోయాయి. విషయం తెలుసుకున్న ఎఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకుని విద్యుత్ అధికారులతో చర్చించి సమస్య పరిష్కారం అయ్యేలా చేస్తామని పోలీసు అధికారులు హామి చేయడంతో గిరిజనులు రాస్తారోకోను విరమించుకున్నారు.

# నాసిరకం పేస్ట్ తయారీదారుపై కేసు నమోదు



విలేఖరులకు వివరాలు వెల్లడిస్తున్న జిల్లా అదనపు ఎస్‌పి సంజీవరావు

**-కర్మాగారం సీజ్-6 క్వింటాళ్ల అల్లం, వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం**

**-జిల్లా అదనపు ఎస్‌పి సంజీవరావు**

**సంగారెడ్డి టౌన్/కంది, జూలై 13, ప్రభాతవార్త:** నాసిరకం అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేస్తున్న కర్మాగారంపై పోలీసులు శనివారం ఉక్కుపాదం మోపారు. నాసిరకంగా తయారు చేసిన 6 క్వింటాళ్ల వరకు అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకోవడంతో పాటు కర్మాగారాన్ని సీజ్ చేశారు. ఇందుకు సంబంధించి జిల్లా కేంద్రమైన సంగారెడ్డి లోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో జిల్లా అదనపు ఎస్‌పి ఎ సంజీవరావు ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ నెల 4వ తారీఖున నమ్మదగిన సమాచారం మేరకు ఇంద్రకరణ్ పోలీసు టాణా ఎస్ఐ పి విజయ్‌కుమార్, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ధర్మేందర్ పాల్‌లు కలిసి జుల్కల్ గ్రామంలోని తహా ఫుడ్స్ పేరుతో అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్న వసీం (30) కర్మాగారంను తనిఖీ చేసి పేస్ట్ తయారికి సిద్దంగా ఉంచిన మెటీరియల్ శాంపిల్‌ను హైద్రాబాద్‌లోని ల్యాబ్‌కు పరిశోధన కోసం పంపించారన్నారు. తక్కువ ధర గల ముడిసరుకులతో అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేస్తుండటంతో పాటు పరిశ్రమ అపరిశుభ్రంగా ఉందన్నారు. కర్మాగారంలో తయారు చేస్తున్న పేస్ట్‌ను జిల్లాతో పాటు ఇతర జిల్లా, రాష్ట్రాలకు సైతం సరఫరా చేస్తూ అక్రమ మార్గంలో డబ్బులు సంపాదిస్తున్నాడన్నారు. కర్మాగారంలో తయారు అవుతున్న పేస్ట్‌తో ప్రజల ఆరోగ్యానికి హానికరంగా ఉందన్నారు. ఇంద్రకరణ్ పోలీసు ఠాణాలో మహమ్మద్ వసీంపై కేసు నమోదు చేసి వసీంను అదుపులోకి తీసుకుని 5 నుంచి 6 క్వింటాళ్ల వరకు అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నామన్నామని, కర్మాగారాన్ని సీజ్ చేసినట్లు ఎఎస్‌పి సంజీవరావు వెల్లడించారు.

## గత ప్రభుత్వంలో మత్స్యకారులకు అన్యాయం : సాయికుమార్



హుజురాబాద్ మత్స్యకారులతో చైర్మన్ మెట్టు సాయికుమార్.

**మెహిదీపట్నం, జూలై 13, ప్రభాతవార్త :** గత ప్రభుత్వంలో మత్స్యకారులకు తీరని అన్యాయం జరిగిందని తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. గత పాలకులు చేసిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేదని మత్స్యకారులకు హామీ ఇచ్చారు. శనివారం మాసబ్‌ట్యాంక్‌లోని మత్స్య భవన్‌లో హుజురాబాద్ నియోజవకర్గ మత్స్యకారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మెట్టు సాయికుమార్‌కు హుజురాబాద్ నియోజకవర్గ మత్స్యకారుల సమస్యలతో పాటు చెరువుల సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. అనంతరం మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ..హుజురాబాద్ నియోజకవర్గంలోని చెరువుల సమస్యలను అతి త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో పాటు మత్స్యకారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గత ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోకపోవడంతోనే ప్రజలు గద్దెదింపారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారధ్యంలోనే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సమావేశంలో హుజురాబాద్ నియోజకవర్గ మత్స్యకారులు ఉన్నారు.

## పుంజాల అలేఖ్యకు అభినందనల వెల్లువ

**చార్మినార్,జూలై 13 ప్రభాతవార్త :** తెలంగాణ సంగీత అకాడమీ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్. పుంజాల అలేఖ్య వినయ్ కుమార్ ను తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు యువక మండలి ప్రధాన కార్యదర్శి ఎప్.పి.క్రాంతి కుమార్, ఉపాధ్యక్షులు జి.నవీన్ కుమార్, కార్యవర్గ సభ్యులు మనోజ్ కుమార్‌తో పాటు పలువురు కలిసి అభి నందనలు తెలియజేశారు.

## గ్రామీణ మూలాల సంతను ప్రారంభించిన టిజేఎస్ అధ్యక్షులు కొదండరాం




**తార్నాక, జూలై 13 ప్రభాతవార్త:** గ్రామ భారతీ 28 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా గ్రామ భారతి, ఎస్ఆర్ మెమోరియల్ ఫౌండేషన్ సంయుక్త ఆద్వర్యంలో శనివారం తార్నాక విజయపురి కాలనీలోని మర్రి కృష్ణా రెడ్డి హాల్లో వివిద వస్తువులతో మూలం సంత పేరుతో ఎగ్జిబీషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ జనసమితి పార్టీ అధ్యక్షులు ప్రొ.కొదండరాం హాజరై మూలం సంతను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించుకోవాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల వారు విక్రయించుకునేందుకు, దళారులను దూరంగా చేసేందుకు ఇలాంటి సంత ఎంతో ఉపయోగపడుతుందని నిర్వాహకులను అభినందించారు. ఈ సంతలో గో ఆదారి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు, చేనేత వస్త్రాలు, దేశీ విత్తనాలు,మిల్లెట్ ఉత్పత్తులు, ఆరోగ్యానికి మేలు చేసే ఉత్పత్తులను ఉంచారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ సేవా రజ్మాతా ఫౌండేషన్ ప్రతినిధులు, గ్రామ భారతి గౌరవ అధ్యక్షులు పాలాది మోహనయ్య, కార్యదర్శి మోహన్, సభ్యులు రాజమౌళి, మదన్ గుప్త, మల్లేషం, బొమ్మకంటి మల్లేషం, దోనూరి రాము, ఏవి.రావు, సుబ్రహ్మణ్యంరాజు, రంగారావు, నరేందర్, సునంద, రజితతో పాటు పలువురు పాల్గొన్నారు.

## సత్యవాణి విద్యానికేతన్ హై స్కూల్‌లో పేరెంట్ ఓరియెంటేషన్ ప్రోగ్రాం



ప్రోగ్రాంలో పాల్గొన్న తల్లిదండ్రులు

**జీడిమెట్ల, జూలై 13, ప్రభాతవార్త**

ఎస్ఆర్ నాయక్ నగర్‌లోని సత్యవాణి విద్యానికేతన్ హైస్కూల్‌లో శనివారం టివిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టి.కోటిరెడ్డి ఆధ్వర్యంలో పేరెంట్ ఓరియెంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి క్రీడో పబ్లిషర్స్ ట్రైనింగ్ మేనేజర్ హేమవతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హేమవతి మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో రాణించడానికి సత్యవాణి విద్యానికేతన్ విద్యాసంస్థ పాటించే నూతన విద్యా విధానాన్ని వర్ణిస్తూ రాబోయే తరం విద్యార్థులు ఎలా ఎదగాలి, విద్యా విధానంలో సమస్యల్ని ఎలా అధిగమించాలో వివరించారు. అనంతరం టివిఆర్ అధినేత కోటిరెడ్డి మాట్లాడుతూ మారుతున్న విద్యా విధానానికి అనుకూలంగా ఎడ్యుకేషన్ సిస్టంలో భాగంగా ప్రాజెక్ట్ బేస్డ్ లర్న్ పద్దతులను అవలంభిస్తూ భవిష్యత్తు తరానికి పునాది వేయడమే మా విద్యా సంస్థల కర్తవ్యం అని తెలిపారు. తమ పిల్లల పట్ల తల్లిదండ్రులు కూడా తమవంతు బాధ్యతలు నిర్వహించాలని కోరారు. విద్యార్థిని విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక కళలను వెలికితీసి వారిని ప్రయోజకులుగా ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దడంలో సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# పదమూడో వార్డులో 'కందకం' కష్టాలు

**-వర్షాకాలంలో వ్యాధుల బారిన పడుతున్న జనం**

**-కందకం మూసివేతకు చర్యలు చేపట్టాలి**



పదమూడో వార్డులోని కందకంలో నిలిచిన మురికినీరు

**జోగిపేట, జూలై 13, ప్రభాతవార్త:** ఇక్కడ వర్షాకాలం వస్తే చాలు చాలామంది అంటువ్యాధులు, ప్రమాదకరమైన డెంగ్యూలాంటి జ్వరాలతోపాటు మలేరియా, టైఫాయిడ్‌ల బారిన పడుతుంటారు. అందుకు కారణం ప్రధానంగా ఈ ఏరియాలో ఉన్న కందకమే, ప్రతినిత్యం ఇండ్లలో వాడే మురికినీరు, వర్షం పడినప్పుడల్లా ఆనీరంతా ఈ మురికినీటితో కలిసిపోయి ఈ కందకంలో ఒకేచోట నిలువ ఉండటంతో దోమలు పెరిగిపోయి అంటువ్యాధు ప్రబలటం ప్రతీ సంవత్సరం ఇక్కడ సాధారణ విషయం. ఇది ఎక్కడో మారుమూల ప్రాంతం అనుకుంటే పొరపాటే. అందోలు-జోగిపేట మున్సిపాలిటీలోని 13వ వార్డు పరిస్థితి. జోగిపేట పట్టణంలో పదవ వార్డు మొదలుకొని 11,12 వార్డుల వెనకభాగం నుంచి పదమూడవ వార్డు చివరిలోని చేనేత సంఘం వరకూ ఈ కందకం సంవత్సరాల నుంచి ఉంది. కాగా గత ప్రభుత్వం హయాంలో దీనిలో కొంత భాగం 11 వార్డు నుంచి 12వ వార్డులో కొంతమేర రాజరాజేశ్వర మందిరం వెనకభాగం వరకూ కోటిన్నర నిధులు కేటాయించి, పెద్ద పైపులైనువేసి మూసివేశారు. కాగా మిగిలిన ప్రాంతం పదమూడో వార్డులో ఉంది. ఇక్కడ వర్షాకాలంలో కందకం భారీఎత్తున మురికినీరు నిలువ ఉండటంతోపాటుగా, పిచ్చిమొక్కలు, పొదలు పెరిగి విపరీతంగా దోమలు పెరిగిపోతున్నాయి. దీంతో వర్షాకాలంలో ఈ వార్డులో ప్రతీ సంవత్సరం చిన్న పిల్లల నుంచి మొదలుకొని ముసలివారు సైతం పలు రకాలైన ప్రమాదకర జ్వరాలబారిన పడుతున్నారు. ముఖ్యంగా ప్రతీసారి ఈ వార్డులో టైఫాయిడ్, మలేరియాతో పాటుగా పలువురు డెంగ్యూ జ్వరం బారినకూడా పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో కందకం మూసేస్తేతప్ప తమకు ఈ వ్యాధుల తిప్పలు తప్పవని వార్డు ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ కందకాన్ని మూసివేయించాలని ఇప్పటికి ఎన్నిసార్లు పలువురు దృష్టికి తీసుకుపోయినా ఫలితంమాత్రం ఉండ టంలేదని వారు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమ పరిస్థి తిని అర్థం చేసుకొని వార్డులోఉన్న కందకాన్ని మూసి వేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇందుకోసం వార్డు కౌన్సిలర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

### కందకం మూసివేతకు రూ.50లక్షల ప్రతిపాదన : వార్డు కౌన్సిలర్ రంగ సురేష్

పదమూడో వార్డులో ప్రధాన సమస్యగా ఉన్న కందకం మూసివేతకోసం తనవంతు ప్రయత్నం చేస్తున్నట్లు వార్డు కౌన్సిలర్ రంగ సురేష్ తెలిపారు. ఇందులో భాగంగా మున్సిపల్ నిధుల్లో నుంచి రూ.50లక్షలు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లి కందకం పూర్తిగా మూసివేతకు అవసరమైన నిధులు సంపూర్ణంగా కేటాఇంచేలా చూస్తానని తెలిపారు.

## గంజాయి అమ్ముతున్న ముగ్గురు అరెస్ట్

**-రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు మొబైల్ ఫోన్‌ల సీజ్**



నిందితులను చూపుతున్న ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్

**ములుగు, జూలై 13 (ప్రభాతవార్త):** గంజాయి అమ్ముతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసిన సంఘటన ములుగు మండలం బండమైలారం గ్రామ శివారులో చోటుచేసుకుంది. ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బండమైలారం గ్రామ శివారులోని సన్‌సిటీ వెంచర్‌లో గంజాయి అమ్ముతున్నారని శుక్రవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో తమకు నమ్మదగిన సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకొని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిని విచారించగా కర్ణాటక రాష్ట్రం గొడగవన్ ప్రాంతానికి చెందిన గవర్నగర్ మహేష్, జార్ఖండ్ రాష్ట్రం హజారిబాగ్ జిల్లా పరాసి ఇచక్ ప్రాంతానికి చెందిన సద్దాం హుస్సైన్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సుతరిగూడ ప్రాంతానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ సమీర్ వీరు ముగ్గురు కలిసి దుండిగల్‌కు చెందిన పద్మ వద్ద గంజాయి కొనుగోలు చేసి అమ్ముతున్నట్లు ఒప్పుకున్నారు. గురువారం పద్మ వద్దకు వెళ్ళి 10 గంజాయి ప్యాకెట్లు రూ.300 చొప్పున చెల్లించి కొనుగోలు చేయగా అందులో ఎనిమిది ప్యాకెట్లు మేడ్చల్‌లో గుర్తుతెలియని వారికి రూ.500 చొప్పున విక్రయించినట్లు తెలిపారు. మిగతా రెండు ప్యాకెట్లు విక్రయించడానికి బండమైలారం గ్రామానికి వచ్చినట్లు ఒప్పుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి వారి వద్ద ఉన్న రెండు ద్విచక్ర వాహానాలను, నాలుగు మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ నేటి యువత మత్తుకు అలవాటు పడి వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటుందని అన్నారు. ఎవరైనా పిల్లలు గంజాయికి అలవాటు పడినట్లయితే వారి తల్లిదండ్రులు తమకు సమాచారం అందిస్తే వారికి కౌన్సిలింగ్ నిర్వహించి అలవాటును మానుకునేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు అమ్మినట్లు తెలిస్తే గజ్వేల్ రూరల్ సిఐ నెం.871 2667336, ములుగు ఎస్ఐ 8712667338 నెంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు. సమాచారం అందించే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

## ప్రజల కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా

**-కొత్త ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి**

**సంగారెడ్డి బ్యూరో, జూలై13 ప్రభాతవార్త:** ప్రజల సేవ కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ప్రజలకు ఏ సమస్య ఉన్నా నేరుగా కలవవచ్చని జిల్లా నూతన ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నూతన ఎస్పీగా వచ్చిన ఉదయ్ కుమార్‌రెడ్డిని జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్ పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం గౌరవ వందర స్వీకరించి జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. 2016 ఐపీఎస్ బ్యాచ్‌కి చెందిన ఉదయ్ కుమారెడ్డి ఇంతకుముందు హైదరాబాద్ సిటీ సౌత్ జోన్ ఎస్పీగా పని చేసి ప్రస్తుతం మెదక్ జిల్లా ఎస్పీగా పదవీ బాధ్యతలు తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తాను ప్రజల సేవ కోసం తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ప్రజలకు ఏ సమస్య ఉన్నా తనను నేరుగా కలవవచ్చని అన్నారు. అలాగే జిల్లాలో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే మానుకోవాలని, లేదంటే అట్టి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని, శాంతికి ఎవరైనా భంగం కలిగించాలని చూస్తే ఊరుకునేది లేదని, శాంతిభద్రతల విషయంలో ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లను సందర్శిస్తానని, సామాన్య ప్రజలకు అందుబాటు ఉంటానని, నేరాల కట్టడానికి నిఘా సారిస్తామన్నారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని, మహిళలపై జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, వారి కోసం షీటీమ్‌ల ద్వారా మహిళలు, యువతుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. నేరాల అదుపుకు రాత్రి వేళల్లో పెట్రోలింగ్, గస్తీ ముమ్మరం చేసానతమని, విజిబుల్ పోలీసింగ్ విధానాన్ని మరింత పటిష్టం చేస్తామని, సంఘటన జరిగిన వెంటనే అక్కడికి చేరుకునేలా ప్రణాళిక రూపొందిస్తామన్నారు. తరచుగా నేరాలు చేసేవారు తమ పద్ధతిని మానుకొని సామజంలో మంచిగా బ్రతకాలని, అలాగే ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వివిధ రకాల అభ్యర్థులు, ఫిర్యాదులు, సామాచారం కోసం వచ్చే ప్రతి ఒక్కరిని మర్యాదపూర్వకంగా ఆహ్వానించి తగు సేలు అందించడంలో ముందుండాలని, ప్రజలందరికీ పోలీస్ వ్యవస్థపై నమ్మకం, విశ్వాసం కలిగేలా విధులు నిర్వహించాలన్నారు. నూతన ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డిని మెదక్ సబ్ డివిజన్ డీఎస్పీ రాజేస్, తూప్రాన్ సబ్ డివిజన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సైబర్ సెల్ డీఎస్పీ ఎస్ఆర్. సుభాష్‌చంద్రబోస్, ఏఆర్ డీఎస్పీ ఎస్ఆర్. రంగనాయక్, జిల్లా సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, డీపీవో సిబ్బంది కలవడం జరిగింది.

## గురుకుల పాఠశాలను రీజినల్ కోఆర్డినేటర్ బీరయ్య తనిఖీ

**-విద్యార్థినుల తల్లిదండ్రులు పాఠశాల ముందు నిరసన**



గురుకుల పాఠశాలను తనిఖీ చేస్తున్న జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ బీరయ్య

**రామాయంపేట మున్సిపాలిటీ, జూలై 13, ప్రభాతవార్త :** రామాయంపేట మున్సిపాలిటీలోని సంక్షేమ గురుకుల పాఠశాలలో 12 మంది విద్యార్థినులను ఎలుకలు కరిచిన ఘటనతో మెదక్ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ బీరయ్య స్పందించారు. శనివారం నాడు ఆయన పాఠశాల, కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాల చుట్టూ పేరుకుపోయిన ముళ్లపొదలు, సెప్టిక్ ట్యాంక్ నుండి వచ్చే పైపులు ఊడిపోతున్నాయని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా అప్పటికే పాఠశాలలకు చేరుకున్న సుమారు 600 మంది విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలో నెలకొన్న సమస్యలను నిలదీస్తూ నిరసనకు దిగారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడే అధికారులు స్పందిస్తారని, మళ్ళీ యధావిధిగా సమస్యలు ఉంటున్నాయని వారు ఆరోపించారు. వెంటనే పరిసరాలలో ఉన్నచెత్తను, పైపులైన్లను బాగు చేయాలని విద్యార్థినుల తల్లిదండ్రులు అధికారులను హెచ్చరించారు. అక్కడే ఉన్న అధికారి మూడు రోజుల్లోగా హాస్టల్, కళాశాలలో ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తామన్నారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల, కళాశాల విజిట్ కోసం రావడం జరిగిందన్నారు. ఈసందర్బంగా విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశమై వెంటనే కాంట్రాక్టర్, ఇద్దరు అటెండర్‌లను బదిలీ చేయాలని అధికారిని డిమండ్ చేశారు. ఈ విషయంలో చర్యలు తీసుకుంటామని ఆయన హామి ఇచ్చారు. హాస్టల్ విద్యార్థులతో చపాతి చేయించడం, గిన్నెలు కడిగించడం, కోడిగుడ్ల పుచ్చులు తీయించడం, బియ్యంలో సన్న ఇసుక రావడం జరుగుతుందని, దీంతో విద్యార్థులు భోజనం చేయలేకపోతున్నారని ఆరోపించారు. తనిఖీకి వచ్చిన కోఆర్డినేటర్ బీరయ్యతో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో ఎన్నో సిసి కెమెరాలు ఉన్నాయని చెప్పడం మాత్రమే కానీ, అక్కడ ఒక్క కెమెరా కూడా లేదని తల్లిదండ్రులు ఆరోపించారు. హాస్టల్లో చెప్పరాని సమస్యలు చాలా ఉన్నాయని వారు ఆరోపించారు. కుక్కలు స్వైర విహారం చేస్తున్నా, విద్యార్థులను ఎలుకలు కరుస్తున్నా పట్టించుకోని అధికారులపై చర్యలు తీసుకోవాలని, లేదంటే ఈ విషయంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు వెళ్లి నిరసన తెలియ జేశారని వారు ఆగ్రహంతో ఊగిపోయారు. పాఠశాలలో నెలకొన్న సమస్యల ను వెంటనే పరిష్కరిస్తానని, ఇలాంటి సమస్యలు మళ్లీ పునరావృతం కా కుండా చూస్తామని అధికారి చెప్పడంతో తల్లిదండ్రులు శాంతించి వెళ్లి పోయారు.

# రీజినల్ రింగ్ రోడ్డుకు మా భూములివ్వం

**-త్రిబుల్ ఆర్ రోడ్డు సర్వేను అడ్డుకున్న రైతులు**

**-మెదక్ హైవే పై రైతుల ధర్నా రాస్తారోకో : కొద్ది సేపు ఉద్రిక్తత**



త్రిబుల్ ఆర్ రోడ్డుకు మా భూములు ఇవ్వమంటు రెడ్డిపల్లి వద్ద ధర్నా రాస్తారోకో చేస్తున్న భూములు కోల్పోతున్న రైతులు తదితరులు

**నర్సాపూర్ జూలై 13. ప్రభాతవార్త :** రీజినల్ రింగ్ రోడ్డుకు మా భూములివ్వబోమని పేర్కొంటు శనివారం నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామానికి, శివ్వంపేట మండలం రత్నాపూర్ గ్రామానికి త్రిబుల్ ఆర్ రోడ్డు సర్వే చేయడానికి వచ్చిన అధికారులను త్రిబుల్ ఆర్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులు అడ్డుకున్నారు. అంతటితో ఆగక ఈ రెండు గ్రామాల భూనిర్వాసిత రైతులు నర్సాపూర్ మెదక్ హైవే లోని రెడ్డిపల్లి వద్ద ధర్నా రాస్తారోకో నిర్వహించారు.ఈ ధర్నాలో రైతులు పలు నినాదాలు చేవారు. ఈమేరకు ట్రాఫిక్ స్తంబించి పోగా వాహానాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది రైతులు రోడ్డు పైన భీష్మించుకు కూర్చోవడంతో పరిస్థితి ఉద్రిక్తతగా మారింది. విషయాన్ని తెలుసుకున్న ఎస్ పుస్పరాజ్ లు వచ్చి రైతులను సముదాయించారు. అయినా రైతుల ధర్నాను కొనసాగించారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈ రీజినల్ రంగ్ రోడ్డులో తమ వ్యవసాయ భూములను ఇవ్వమని వారు ఖరాఖండిగా తేల్చి చెప్పారు.త్రిబుల్ రోడ్డుకు మా భూములు ఇవ్వమని అధికారులు వెంటనే సర్వేను నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రదాన రోడ్డులో ధర్నా చేస్తున్న రైతులు త్రిబుల్ ఆర్ రోడ్డు మాకోద్దంటు సర్వేను నిలిపివేయాలని వారు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.తమకు కొద్ది పాటి పంట భూములున్నాయని ఈ భూములను కాస్తా త్రిబుల్ ఆర్ రోడ్డుకు ఇస్తే తాము బతికేది ఎలాగని వారు ప్రశ్నించారు. తమ ప్రాణాలు పోయినా త్రిబుల్ ఆర్ రోడ్డు భూములను ఇచ్చేది లేదని తెలిపారు. ఈ మేరకు నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, మండల తహశీల్దార్ కమలాద్రి ,ఎస్ఐ పుష్పరాజ్‌లు ధర్నా చేస్తున్న రైతులకు వచ్చి ఎంత నచ్చ జెప్పె ప్రయత్నాలు చేసినా రైతులు లెక్క చేయకుండా వినలేదు. ఈ మేరకు అధికారులు సర్వే చేయకుండానే వినుదిరగి వెళ్ళి పోయారు.ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి , రత్నాపూర్ గ్రామాల భూనిర్వాసిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న చిన్నారుల కూచిపూడి నాట్య ప్రదర్శనలు



ఉప్పల్ మినీ శిల్పారామంలో కూచిపూడి నాట్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

**ఉప్పల్, జూలై 13 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం నాట్య గురువు తేజస్విని, రజనీ వాచస్పతి బృందం ఆధ్వర్యంలో స్వర నృత్య విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా రజనీ వాచస్పతి శిష్య బృందం త్రిశతి, శ్రీనిధి, అనర్య, అనన్య, మయూఖ,స్నేహా, ప్రణతి, హృతిక, సంజన, వైష్ణవి తదితరుల సంగీత అలాపన చేశారు. వీరికి అనిల్ తబలాపై సహకరించారు. తేజస్విని శిష్య బృందం సునీత, స్నిగ్ధ, షణ్ముఖి, తన్విక, హీరా, రిత్విక, శ్రీలేఖ్య, అద్విక, విశేత, వైష్ణవి తదితరులు తాండవ నృత్యకారి, మూషిక వాహన, తక్కువేమి మనకు, జత్వి స్వరం, చేరి యశోధకు, కులుకుగా నడవరో తదితర అంశాలను ప్రదర్శించి మెప్పించారు. శనివారం సెలవు దినం కావడంతో సందర్శకుల నుంచి మంచి స్పందన ఉందని నిర్వహకులు తెలిపారు.

## టిమ్స్ ఆసుపత్రి నిర్మాణ పనులు వేగవంతం చేయాలి : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జూలై 13 ప్రభాతవార్త:** ఆస్పత్రి నిర్మాణం పనులు వేగవంతం చేయాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. చైతన్యపురి పండ్ల మార్కెట్ స్థలంలో నిర్మిస్తున్న టీమ్స్ హాస్పిటల్స్ నిర్మాణం పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్పిటల్ స్థల పరిసరాల్లో ప్రస్తుత భావితరాలను ఇబ్బందులు జరగకుండా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఒప్పించి పోలీస్‌స్టేషన్, చిల్డ్రన్‌పార్క్, సబ్‌స్టేషన్, వాటర్‌ట్యాంక్, కమ్యూనిటీహాల్ నిర్మిస్తున్నామని తెలిపారు. నిమ్స్, ఉస్మానియా, గాంధీ హాస్పిటల్‌లో ప్రజలకు వైద్య సేవలు అందించడం భారంగా మారడంతో నగరం నలు దిక్కులా సూపర్ స్పెషలిటీ ఆసుపత్రుల నిర్మాణం జరుగుతుందన్నారు. టీమ్స్ హాస్పిటల్ నిర్మాణం చేయడం నాజీవితంలో మరచిపోలేని సంఘటన అన్నారు. ఆస్పత్రి ఆవరణలో దేవాలయం మసీదు నిర్మిస్తున్నామని, ఆస్పత్రికి వచ్చే వారు సేదతిరడానికి ప్రక్కనే అయిదు అంతస్థుల భవనం కూడా నిర్మించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు తోట మహేష్‌యాదవ్, సొంటి చంద్రశేఖర్‌రెడ్డి, పవన్, గట్టు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## నిరు పేద విద్యార్థినికి ఆర్థిక సహాయం



పేద విద్యార్థికి ఆర్థిక సహాయం అందిస్తున్న లక్ష్మీనారాయణ

**వనస్థలిపురం, జూలై 13 ప్రభాతవార్త:** ఉన్నత చదువుకోసం పేద విద్యార్థినికి ఆర్థిక సహాయం చేయడం అభినందనీయమని శ్రీ ఆదత్య ఐఐటి కాన్సెప్ట్ స్కూల్ ఛైర్మన్ కెఎస్‌వి సుధాకర్ పేర్కొన్నారు. వనస్థలిపురంలోని వనస్థలి హిల్స్ కాలనీలోని శ్రీ ఆదిత్య ఐఐటి కాన్సెప్ట్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న లక్ష్మీ ప్రసన్నకు ఎన్‌ఆర్‌ఐ దంపతులు రాచకొండ మహేష్, సుష్మ దంపతులు 10 వేల రూపాయల ఆర్థిక సహాయం చేసారు. లక్ష్మీప్రసన్న తల్లి దండ్రులు 2022లో చనిపోవడంతో నాయనమ్మ సంరక్షణలో ఉంటున్న విషయాన్ని తెలుసుకున్న సుధాకర్ తన పాఠశాలలో గత 3 సంవత్సరాలుగా ఉచిత విద్యను అందిస్తున్నారు. కాగా లక్ష్మీప్రసన్న విషయాన్ని కాలనీలో ఉంటున్న రిటైర్డ్ ఉద్యోగి లక్ష్మీనారాయణ కెనడాలో ఉంటున్న తన కుమార్తె, అల్లుడు సుష్మ మహేష్‌లకు తెలిపారు. దీంతో వారు రూ. 10 వేలను పంపించగా నగదును లక్ష్మీనారాయణ దంపతులు లక్ష్మీప్రసన్నకు అందజేసారు.

## దివ్యాంగుల సంక్షేమానికి కృషి : వీరయ్య

**మలక్‌పేట, జూలై 13 ప్రభాతవార్త:** దివ్యాంగుల అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తామని వికలాంగుల సహకార సంస్థ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య పేర్కొన్నారు. మలక్‌పేటనల్గొండ చౌరస్తాలని వికలాంగుల సహకార సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యా సంస్థల్లో వికలాంగులకు 5 శాతానికి తగ్గకుండా రిజర్వేషన్లు, 5 సంవత్సరాల వయస్సు సడలింపుకోసం జిఓ జారీ కాబోతుందని, త్వరలో దివ్యాంగులకు తీపి కబురు అందుతుందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి దివ్యాంగులపట్ల అత్యంత ప్రేమతో ఉన్నారని, విద్య ద్వారానే సర్వతో ముఖాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

## భవన్స్ కళాశాలలో ఫెషర్స్ డే వేడుకలు




ఫ్రెషర్స్‌డే వేడుకల్లో భవన్స్ కళాశాల విద్యార్థులు..

**నేరేడ్‌మెట్, జూలై 13 ప్రభాతవార్త :** విద్యార్థులు క్రమశిక్షణతో తమ ఉజ్వల భవిష్యత్తుకు పునదులు వేసుకోవాలని, విద్యతో పటు మంచి నడవడికను అలవాటు చేసుకోవాలని భవన్స్ వివేకానంద కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జిఎస్ విఆర్‌కె చౌదరి పేర్కొన్నారు. శనివారం భవన్స్ వివేకానంద కళాశాలలో నూతన విద్యార్థుల కోసం ప్రజ్వలితే పేరుతో ఫ్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో చేరిన నాటి నుండే వారి నడవడికలో మార్పు రావాలన్నారు. అధ్యాపకులను గౌరవించి విద్యను అందిపుచ్చుకోవడంలో వారే ముందుండాలన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకురాలు కమల దేవి, కో ఆర్డినేటర్ దివ్యరేఖ, అన్ని విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి : మంత్రి పొన్నం ప్రభాకర్



గీతా కార్మికులతో ముచ్చటిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

**అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 13 ప్రభాతవార్త:** అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఆదివారం జరుగబోయే కాటమయ్య రక్షణ కవచం ప్రారంభోత్సవానికి విచ్చేయుచున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాబోతున్నారని ఆ కార్యక్రమం నిర్వహించే సభాస్థలిని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం సభాస్థలిలో ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలతోపా భద్రతా ఏర్పాట్లపై పోలీసులతో మాట్లాడారు. అదే విధంగా సభకు ఎంత మంది గీతా కార్మికులు హాజరవుతున్నారని, అందుకు చేసిన ఏర్పాట్లపై ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కలెక్టర్ శశాంకలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులతోపాటు గౌడ సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యంగిరాదేవి సన్నిధిలో మల్లు నందిని బట్టి విక్రమార్క ప్రత్యేక పూజలు



మల్లు నందినికి అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న శ్రీనివాసరావు

**ఎల్.బి.నగర్, జూలై 13 ప్రభాతవార్త:** ఆర్కేపురంలోని కుర్తాల పీఠం శ్రీ వారాహీ సమేత శ్రీప్రత్యంగిరా పరమేశ్వరి దేవాలయంలో వారాహిదేవి నవ రాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ప్రతిరోజు 20వేల భక్తులు అమ్మ వారిని దర్శించుకుంటున్నారు. ప్రతిరోజు కుంకుమార్చన, పారాయణలు, 18 రకముల ద్రవ్యములతో అమ్మవారికి విశేష అభిషేకాలు, దేవాలయ ప్రాంగణ మంతా రంగురంగుల పుష్పములతో అలంకరించారు. తెలంగాణ ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టివిక్రమార్క సతీమణి మల్లు నందిని అమ్మవారిని దర్శించు కుని లక్ష పుష్పార్చన సేవ, హోమం చేశారు. ఈ సందర్భంగా నందిని మాట్లాడుతూ కుర్తాళం పీఠాధిపతులు జగద్గురు శ్రీ సిద్ధేశ్వరానంద భారతి మహా స్వామి వారు గొప్ప మంత్ర స్వరూపులనీ, వారు చేసే కార్యక్రమాలలో పాల్గొనడం అదృష్టమన్నారు. నగరంలో జరిగిన కోటి ప్రత్యంగిరా మహాయాగంలో పాల్గొనడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా దేవాలయం సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్‌రావు అమ్మవారి జ్ఞాపికను, ప్రసాదాన్ని దీపికకు అందజేశారు. ఈ కార్యక్రమంలో విఠల్‌శర్మ ,సంపత్, అరుణ, రాజేశ్వరి, హేమ, సాయికుమార్‌శర్మ, రామశర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు వినతి



తీన్మార్ మల్లన్నకు వినతి పత్రం సమర్పించిన ఉద్యమ నాయకులు

**తుర్కయాంజాల్, జూలై 13 ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఛైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల సమస్యలతోపాటు ఉద్యమకారులకు ఇస్తానన్న 250 చదరపు గజాల స్థలాన్ని అందించే విధంగా శాసనమండలిలో గొంతువినిపించాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కలిసి మెమోరాండం అందజేసారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కారింగుల నరేందర్‌గౌడ్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి, రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు దుగ్గాణి శ్యామల పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి : డాక్టర్ సంతోష్‌రెడ్డి



బహుమతులను అందజేస్తున్న జడ్ఇఓ అంకమ్మరావు తదితరులు

**మలక్‌పేట, జూలై 13 ప్రభాతవార్త:** విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలని డాక్టర్ సంతోష్‌రెడ్డి పేర్కొన్నారు. దిల్‌సుక్‌నగర్ భాష్యం పాఠశాల ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఆహారంతోపాటు సరైన నిద్ర, వ్యాయామం చేయాలన్నారు. అనంతరం జడ్ఇఓ అంకమ్మరావు, ప్రిన్సిపల్ పల్లవిలు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు అన్ని కళల్లో ప్రోత్సాహం అందిస్తూ, వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేసారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

## మల్కాజిగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పరమేష్‌ను నియమించాలి

**నేరేడ్‌మెట్, జూలై 13 ప్రభాతవార్త :** మల్కాజిగిరి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో గత కొన్ని సంవత్సరాలుగా పని చేస్తున్న రమేష్‌ను సీనియర్ అసిస్టెంట్‌గా నియమించాలని స్థానికులు, బిల్డర్లు శనివారం మల్కాజిగిరి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ముందు ప్ల కార్డులను పట్టుకొని అధికారులను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6 సంవత్సరాల క్రితం సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించిన రజియుద్దీన్ ఇటీవలే పదవి విమరణ చేసారు. అప్పటి నుండి నేటి వరకు మల్కాజిగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ లేకపోవడంతో పలు పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 23 సంవత్సరాల అనుభవం ఉన్న పరమేష్‌ను సీనియర్ అసిస్టెంట్‌గా నియమించి పనులకు ఆటంకం కలగకుండా ప్రభుత్వం, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారి, జిల్లా రిజిస్ట్రేషన , మేడ్చల్ అధికారి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు బిల్డర్లు, స్థానికులు పాల్గొన్నారు.

## మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు రాణించాలి

**సరూర్‌నగర్, జూలై 13 ప్రభాతవార్త:** ఈ పోటీ ప్రపంచంలో మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు రాణించాలని సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ మేడిబౌలిలోని టికెఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం గ్రాడ్యుయేషన్ డే కనుల పండువగా జరిగింది. టికెఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ తీగల హరినాథ్‌రెడ్డి, ట్రెజరర్ తీగల అమర్‌నాథ్‌రెడ్డిల ఆధ్వర్యంలో కాలేజీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన కాలేజీ ఛైర్మన్ తీగల కృష్ణారెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరంగా నేడు ప్రపంచం ఎంతో ముందుకు దూసుకుపోతున్నదని అన్నారు. గతంలో తాము చదువుకునే రోజుల్లో పరిస్థితులు వేరు ఇప్పటి పరిస్థితులు వేరని ఆయన తెలిపారు. నేడు సమాజంలో టెక్నాలజీపరంగా రోజు రోజుకు కొత్త ఆవిష్కర ణలవుతూ అవి అప్డేట్ అవుతున్నాయని పేర్కొన్నారు. ఉదాహరణకు సిగ్గి, జొమాటో, ఊబర్, ఓలా అనేవి ఎవరో ఒకరు కనిపెడితేనే వచ్చాయనీ ఈ నేపథ్యంలో విద్యార్థులు ప్రభావితులై కొత్త ఆవిష్కరణలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. మంచి స్నేహితులను సమన్వయం చేసుకుంటూ తల్లిదండ్రుల కలలను సాకారం చేస్తూ చదువుకున్న కాలేజీకి పేరు తెచ్చేలా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త విషయాలను నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండాలని ఆయన తెలిపారు. ఫిజికల్ హెల్త్‌తో పాటు మెంటల్ హెల్త్‌పై దృష్టి పెడుతూ జీవితంలో సక్సెస్ సాధించాలని ఆయన అన్నారు. కాగా గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా ఆయన కాలేజీ యాజమాన్యంతో కలిసి విద్యార్థులకు పట్టా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పరిషత్ తాజా మాజీ ఛైర్మన్ డాక్టర్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి, టికెఆర్ కాలేజీల ప్రిన్సిపాళ్ళు, హెచ్ఓడిలు, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులతోపాటు కాలేజీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గడ్డమీది లక్ష్మీనర్సింహారెడ్డి, సుమన్, జాన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ

## సమాజ హితంకోసం రిటైర్డ్ ఉద్యోగులు సమయం కేటాయించాలి : కేంద్ర మంత్రి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన కృష్ణాదిశేషు

**వనస్థలిపురం, జూలై 13 ప్రభాతవార్త:** కేంద్ర బొగ్గు, గనుల శాఖా మంత్రిగా జి.కిషన్‌రెడ్డి పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కేంద్ర ఫిల్మ్‌సెన్సార్ బోర్డు సభ్యులు కృష్ణాదిశేషు పెంటపాటి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సంధర్భంగా కృష్ణాదిశేషు మాట్లాడుతూ సెన్సార్ బోర్డు ద్వారా సినిమాలలో సమాజానికి హాని చేసే దృశ్యాలను డైలాగులను నియంత్రించి, దేశప్రతిష్టను ఇనుమడింప జేయవచ్చుని కానీ రీల్స్ ఒటిటి లాంటి మాధ్యమాలకు నియంత్రణ లేకపోవడంవల్ల అదుపు తప్పుతున్నాయని దీంతో ముఖ్యంగా యువతపై చెడుప్రభావం చూపుతుందని మంత్రితో పేర్కొన్నారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ దీని విషయంపై ఆలోచించాలని అలాగే పదవీ విరమణ చేసిన వారు కుటుంబ భాద్యతలు తీరినవారు సమాజం హితవు కోరి కొంత సమయం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి యువ మోర్చా జనరల్ సెక్రటరీ జ్యోతితో తదితరులు ఉన్నారు.

## అవసరమైన చోట యుజిడి నిర్మాణం



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ

**సైదాబాద్, జులై 13 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్‌లో అవసరమైన చోట నేటి అవసరాలకు తగ్గట్లుగా నూతన యుజిడి నిర్మాణాన్ని చేపడుతున్నామని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. ప్రసన్నాంజనేయ కాలనీలో వాటర్ వర్క్స్ డిజిఎం శీలారాణితో కలిసి పాదయాత్ర చేస్తూ స్థానిక సమస్యలు పరిశీలించిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో నూతన యుజిడి నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కాలనీవాసులు సతీష్, నరోత్తమ్, మంగ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బోనాల ఉత్సవాలు : భాగ్యలక్ష్మి



ఆలయ ప్రతినిధులకు చెక్కులు అందజేస్తున్న భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, జూలై 13 ప్రభాతవార్త:** బోనాల ఉత్సవాలు సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపాలుగా నిలుస్తాయని మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. నగరంలోని ఎండోమెంట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బోనాల ఉత్సవాలకు విడుదల చేసిన చెక్కులను ఆలయ నిర్వాహకులకు అందజేసారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సురేఖ, గోవర్ధన్, ఆలయ కమిటీ సభ్యులు రవి, మురళి, యాదగిరి, హరి, వినయ్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

## శివసేనారెడ్డికి మేయర్ అభినందనలు



శివసేనారెడ్డిని అభినందిస్తున్న మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, జూలై 13 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్‌గా పదవీబాధ్యతలు చేపట్టిన రాష్ట్ర యువజనకాంగ్రెస్ అధ్యక్షుడు కె.శివసేనారెడ్డిని మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన టిపిసిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. సిపిఎన్‌ఆర్ ట్రస్ట్ ఛైర్మన్ చిగిరింత దయాసాగర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యుఐ నాయకులు, కార్యకర్తలతో కలిసి తరలివెళ్ళిన ఆమె శివసేనారెడ్డిని శాలువాతో సన్మానించి బొకేనిచ్చి అభినందనలు తెలిపారు.

**బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి సన్మానం...** తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన శివసేనారెడ్డికి నియోజకవర్గ యువజన కాంగ్రెస్‌అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి యూత్‌కాంగ్రెస్ కార్యకర్తలతో తరలివెళ్ళి బొకే అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే పిడి యాక్ట్ : డిటి మాచన రఘునందన్

**తుర్కయాంజాల్, జూలై 13 ప్రభాతవార్త:** రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించి, రైస్ మిల్లులకు, పౌల్ట్రీలకు అమ్ముతున్న వాళ్ళపై పీడీ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తామని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటి మాచన రఘునందన్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది మొదలుకుని జులై నెలవరకు ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసుల సంఖ్యను గమనిస్తే కొందరు అదే పనిగా రేషన్‌బియ్యం దందా చేస్తున్నట్టు తెలుస్తోందన్నారు. కొన్ని రైస్ మిల్లులు రేషన్ బియ్యం కొనడమే దందాగా పెట్టుకున్నందుకు నెలకు 5,6 కేసులు ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదవుతున్నాయన్నారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తూ 2 పర్యాయలకంటే ఎక్కువ పట్టుబడితే పిడి యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేయడం ఖాయమని స్పష్టం చేశారు. రేషన్ అక్రమ దందా చేస్తే ఆయా డీలర్ల డీలర్ షిప్ రద్దు చేసేందుకు వెనకాడే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు.



రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మల్‌రెడ్డి రాంరెడ్డి సతీ సమేతంగా కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయస్వామి ఆలయానికి విచ్చేసి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆశీర్వచనం అందజేస్తున్న అర్చకులు (ప్రభాతవార్త, సైదాబాద్)

## అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి : కార్పొరేటర్ బద్దం



పనులను పరిశీలిస్తున్న ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జూలై 13 ప్రభాతవార్త:** అభివృద్ధి పనుల విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని గడ్డి అన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి సూచించారు. కమలానగర్‌కాలనీ నుండి నేతాజీనగర్ చౌరస్తా వరకు నిర్మిస్తున్న స్ట్రామ్‌వాటర్ పనులను శనివారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కమలానగర్‌కాలనీ వాసులకు, వ్యాపారులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా లెవెల్స్ సరి చూసుకొని నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. కాలనీల్లో ఇళ్ల ముందు ఏర్పాటు చేసుకున్న ర్యాంపులను, రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్లను ఇళ్ల యజమానులు స్వచ్ఛందంగా తొలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు సత్యనారాయణ, బీజేపీ గడ్డిఅన్నారం డివిజన్ అధ్యక్షులు దాసరి జయప్రకాష్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు బొమ్మరాజు సందీప్, ఆమంచ శ్రీను, తరుణ్, నాని, రఘునందన్‌జోషి, టీంకు, రామ్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలపై ఆటో డ్రైవర్లకు అవగాహన



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సిఐలు లక్ష్మి మాధవి, సూర్యనాయక్

**ఉప్పల్, జూలై 13 ప్రభాతవార్త :** ట్రాఫిక్ నిబంధనలు పాటించని ఆటో డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సిఐ లక్ష్మి మాధవి, సూర్య నాయక్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం రామంతాపూర్ బస్టాప్‌లో ఆటో డ్రైవర్లు, వ్యాపారస్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా వాహనాలు పార్కు చేసుకోవాలని సూచించారు. రోడ్లపై వాహనాలు పెట్టి ఇబ్బంది కలిగించే వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు మహిపాల్‌రెడ్డి, ఉదయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి : శ్రీవాణి



సిసి రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులు

**రామంతాపూర్, జూలై 13 ప్రభాతవార్త :** రామంతాపూర్ భరత్‌నగర్‌లో రూ.75లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను శనివారం స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సిసి రోడ్డు పనులు ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, అధికారులతో చర్చించి పనులు చేపట్టినట్లు తెలిపారు. పనుల విషయంలో నాణ్యత పాటించాలని, ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ శ్వేతశ్రీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, శాగ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.